
ప్రపంచ
ఆహార సంస్థ
ఐక్యరాజ్య
సమితి

# బాధ్యతాయుతమైన మత్స్యకార్యకలాపములను నిర్వహించుటకు ప్రవర్తనా నియమావళి అనగా ఏమిటి ?



# బాధ్యతాయుతమైన మత్స్యకార్యకలాపములను నిర్వహించుటకు ప్రవర్తనా నియమావళి అనగా ఏమిటి ?

ప్రపంచ ఆహార సంస్థ ఐక్యరాజ్య సమితి
రోమ్, 2001

ఈ ప్రచురణలో నియుక్తమైన హోదాలు మరియు సమాచార ఉత్పాదన అంశాలు. ఏ దేశపు న్యాయస్థితికి, సరిహద్దులు, పట్టణములు, ప్రాంతం, వాటి అధికారాలు సంబంధించి కాని లేదా దాని సరిహద్దులు లేదా ఎల్లలపై ఐక్యరాజ్య సమితి యొక్క ఆహార వ్యవసాయ సంస్థ తరుపున ఎలాంటి భావ ప్రకటనగా అన్వయించుకొనరాదు.

ఐ.ఎస్.బి.ఎన్ 92-5-1045-0

అన్ని హక్కులు రిజర్వు చేయబడినవి. ఈ సమాచార ఉత్పాదన యొక్క పునరుత్పత్తి, విషయ ప్రేషణ విద్యా విషయంగా గాని లేదా ఇతర వాణిజ్యేతర ఉద్దేశ్యముల కొరకు, వనరుల పట్ల కృతజ్ఞత పూర్తిగా ప్రకటించినచో, అనుమతించబడినది. నకలు హక్కుదారుల పూర్వ లిఖితానుమతి లేక, ఈ సమాచార ఉత్పాదన లోని విషయ పునరుత్పత్తి, (అమ్మకం కొరకు లేదా ఇతర వాణిజ్య ఉద్దేశ్యము కొరకు) నిషేధించబడినది. అటువంటి అనుమతి కొరకు దరఖాస్తులు, ముఖ్యాధికారి ప్రచురణ మరియు మల్టీమీడియా సేవ, సమాచార విభాగం ఆహార వ్యవసాయ వ్యవస్థ వెయిలీ దెల్లా టెర్మ్ డి కొరకల్లా 00100 రోమ్ ఇటలీ లేదా కాపీరైట్ ఎఫ్ఏఓ ఓఆర్జీనకు ఇ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

© ఎఫ్ఏఓ 2001

# బాధ్యతాయుతమైన మత్స్యకార్యకలాపములను నిర్వహించుటకు ప్రవర్తనా నియమావళి అనగా ఏమిటి ?

మత్స్య పరిశ్రమ మరియు ఆక్వా సాగు ద్వారా ప్రపంచ జనాభాకు ఆహారం, ఆదాయం, ఉపాధి కల్పన మరియు మానసిక ఉల్లాసం కలిగించబడు తున్నాయి. లక్షల మంది ఈ చేపల వలన జీవనోపాధి పొందుతున్నారు. ముందు తరముల ప్రజానీకానికి కావల్సినంత మత్స్య సంపదను అందించాలంటే మత్స్య పరిశ్రమలోని ప్రతి ఒక్కరు మత్స్య సంపదను నియంత్రణ చేసి, పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రపంచ ఆహార సంస్థలోని 170 సభ్య దేశాలు 1995 లో బాధ్యతాయుత మత్స్య పరిశ్రమ కొరకు ప్రవర్తనా నియమావళి పాటించేందుకు ఒప్పుకున్నాయి. మత్స్య పరిశ్రమకు సంబంధించిన వారికి అనగా సముద్రములో వేటాడేవారు, ఉప్పునీటి కయ్యలు, మంచినీటి వనరులలో చేపల పెంపకము చేసేవారు, చేపలతో ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధం గల ప్రతి ఒక్కరికి ఈ నియమావళి వర్తిస్తుంది. అయితే ఈ నియమావళిని ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా పాటించవలసినదేకాని, చట్టబద్ధమైనది కాదు. అయినప్పటికి, మత్స్య పరిశ్రమతో అనుబంధమున్న వ్యక్తులంతా ఈ ప్రవర్తనా నియమావళి యొక్క సూత్రాలకు, లక్ష్యాలకు తమంత తాముగా కట్టుబడి వుండి, వాటిని అమలు పరచే లక్ష్య సాధనకు అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం వుంది.

ఈ ప్రవర్తనా నియమావళిలో నియమాలు, లక్ష్యాలు కార్య నిర్వహణ చర్యల గురించి క్రోడీకరించడానికి సుమారు 2 సంవత్సరాల కాలం పట్టింది. ప్రపంచ ఆహార సంస్థలోని సభ్యదేశాల ప్రతినిధులు, ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థలు, మత్స్య పరిశ్రమకు చెందిన వివిధ వ్యక్తులు ఎంతో సమయాన్ని వెచ్చించి ఈ నియమావళిని అందరి ఆమోదము పొందేలా తీర్చిదిద్దారు. ఈ విషయంలో, ఈ కోడ్ విస్తృతపరిధిలో మత్స్య పరిశ్రమ/ఆక్వా సమస్యల పైన ప్రపంచదేశాల ఏకాభిప్రాయం/ఒప్పందం ప్రతిబింబిస్తున్నది.

ఈ నియమాళిని, మత్స్య పరిశ్రమలోని సభ్యులు మరియు మత్స్యకార కుటుంబీకుల సహకారంతో అమలు పరచడానికి ప్రభుత్వాలు, బాధ్యత తీసుకొనవలసి యున్నది. దేశీయ మత్స్య విధానాలను అమలు పరచడం ప్రభుత్వాల మీద ఆధార పడి ఉన్నందువలన, ప్రపంచ ఆహార సంస్థ, ఈ ప్రవర్తనా నియమావళిని నేరుగా అమలు పరచలేదు. కాని ప్రపంచ ఆహార సంస్థ ద్వారా తగిన సాంకేతిక విషయాలపై సభ్యదేశాలు సహకారం పొందవచ్చును.

ఈ ప్రవర్తనా నియమాళిలోని అంశాలు, నియమాలు, లక్ష్యాలను ప్రభుత్వాలన్ని తమతమ జాతీయ విధానాలలోను మరియు చట్టాలలోను ఎప్పుడైతే పొందుపరుస్తారో, అప్పుడే ఈ నియమావళిని అమలుపరచడం సాధించవచ్చు. దీనికోసం ప్రభుత్వాలు, మత్స్య పరిశ్రమలోని వివిధ సభ్యుల సలహాలు, సహాకారం పొంది తద్వారా, వారి వద్దనుండి స్వచ్ఛంద ఆమోదం పొందినప్పుడు, ఈ నియమావళి లక్ష్యాలను సాధించగలుగుతాము. మత్స్యకార వర్గాలు, పరిశ్రమలు పై లక్ష్య సాధనలో స్థిరమైన కార్యాచరణ సిద్ధాంతాలు ఏర్పాటు చేసుకోవలసి ఉన్నది. ఈ నియమావళిని పాటించడానికి, ఆమోద యోగ్యమైన, సమర్థవంతమైన ఆచరణలో ఉంచడానికి ఇది ఒక ముఖ్యమైన మార్గము.


ప్రవర్తనా నియమావళిలోని కొన్ని ముఖ్యమైన అంశాల గురించి, సాంకేతిక పరిజ్ఞానం అవసరం లేకుండానే వివరించడమే ఈ చిన్న పుస్తకం యొక్క ముఖ్యోద్దేశ్యము. ఈ సమాచారం ద్వారా వివిధ మత్స్యకారులకు, రైతులకు, ఇతరులకు, ప్రవర్తనా నియమావళి లక్ష్యాలను, ఉద్దేశాలను తెలియచేసి, తద్వారా చిన్న తరహా – పెద్ద తరహా వ్యక్తులందరిని జాగృతపరచి నియమావళిని సాధించెటట్లుగా చేయవచ్చునన్న ఆశ. ఈ పుస్తకము కోడ్‌నకు ప్రత్యామ్నాయం కాదు. ఇది విస్తృత సమాచారాన్ని మాత్రం అందిస్తున్నది.

ఈ ప్రవర్తనా నియమావళిని ప్రపంచ ఆహార సంస్థ తమ అయిదు అధికార భాషలలోనికి అనుమదించినది. అవి అరబిక్, చైనీస్, ఇంగ్లీషు, ఫ్రెంచ్ మరియు స్పానిష్ భాషలు. అంతే గాక, అనేక ప్రభుత్వాలు, పరిశ్రమలు, ఇతర సంస్థలు, వీటిని వివిధ భాషలలోనికి అనువాదం చేసినవి. వీటిలో కొన్ని భాషల అనువాదాన్ని ప్రజలందరికి అందుబాటులో ఉంచేందుకు వీలుగా ప్రపంచ ఆహార సంస్థ యొక్క మత్స్యశాఖ ఈ క్రింది పేర్కొన్న వెబ్‌సైట్ నందు ఇంటర్‌నెట్‌లో పొందు పరచినది.

http://www.fao.org/fi/agreem/codecond/codecon.asp.

ఇంటర్‌నెట్ సదుపాయంలేని వారు, ఈ క్రింది అడ్రస్‌కు వ్రాసి, పైన పెర్కొన్న అయిదు భాషలలో, ఏ భాషలో ప్రవర్తన నియమావళి ప్రతిని పొందాలనుకొంటున్నారో తెలపాలి.

ఛీఫ్ ఆఫ్ సర్వీస్, ఎఫ్.ఐ.పి.ఎల్., ఫిషరీస్ డిపార్‌మెంట్ ఆహార మరియు వ్యవసాయ సంస్థ, వెయల్ డెల్లా తర్మిడీ కారకల్లా 00100 రోమ్–ఇటలీ.



## పరిచయం


భావి తరాల ప్రజానికానికి మత్స్య సంపద చేకూర్చడానికి, మత్స్యకారులు, మత్స్య పరిశ్రమలోని వివిధ వ్యక్తులు మత్స్యవనరులను, వారి నివాస ప్రాంతాలను సరైన రీతిలో పరిరక్షించి, నిర్వహించడానికి సంఘటితంగా సమాయత్తమవ్వాలని ప్రవర్తనానియమావళి నొక్కి చెబుతోంది.

మత్స్య సంపదను సరైన రీతిలో ఉంచడానికి లేదా పునరుద్ధరించడానికి ప్రతివ్యక్తి తమ వంతు కృషి చేసి, వర్తమాన, భవిష్యత్తులలో అధిక మత్స్య సంపద ఉత్పత్తికి దోహదపడాలి. దీనినే అత్యధిక ఫలవంతమైన దిగుబడి అంటారు.మత్స్యకార కుటుంబాలలో పేదరిక నిర్మూలన జరిపి, నిరంతర ఆహారోత్పత్తి, జలవనరుల పరిరక్షణ వంటి దీర్ఘ కాల ప్రయోజనాల కోసం జాతీయ మత్స్య విధానాలను సరైన విధంగా ఆచరణ సాధ్యంగా రూపకల్పన చేసుకోవాలి. కాబట్టి, ప్రతిదేశము లేదా అనేక దేశాలు తమ తమ మత్స్య పరిశ్రమను, జల సంవర్ధనము (ఆక్వా కల్చర్) అభివృద్ధి పరచుకోనేందుకు సహాయ పడడమే ప్రవర్తన నియమావళి ముఖ్యోద్దేశ్యము.

మంచి మత్స్యకార విధానాలు తయారుచేయడానికి విధులు, నైపుణ్యం మరియు అనుభవం ఎంతో అవసరం. ఇవి అభివృద్ధి చెందుతున్న దేశాలలో గానీ లేదా చిన్న చిన్న దీవులుగా ఉన్న దేశాలలోగానీ ఎల్లప్పుడు లభించవు. కాబట్టి, అంతర్జాతీయ సంస్థలైన ప్రపంచ ఆహార సంస్థ మొదలగునవి ఇట్టి చిన్న చిన్న దేశాలకు చేయూతనిచ్చి, వాటి సమర్థతను పెంచి, తద్వారా వీటి మత్స్య పరిశ్రమ జల సంవర్థనములను అభివృద్ధి పరచడానికి కృషిచేయవలసినదిగా ప్రవర్తనా నియమావళి ప్రోత్సహిస్తోంది.

ఈ నియమావళి, మత్స్య సంపదను బాధ్యతాయుతంగా ఏ విధంగా నిర్వహణ చేయవలెనో చేపలపేటను ఏ విధంగా కొనసాగించవలెనో వివరిస్తోంది. అదే విధంగా మత్స్య ఫలసాయ పరిరక్షణ (పోస్ట్‌హార్వెస్ట్) వర్తకము మత్స్య పెంపక అభివృద్ధి వంటి అంశాలను గురించి కూడా ఈ నియమావళి చర్చించింది. అంతేకాక, ప్రతి దేశము తమ పొరుగు దేశాల మత్స్య పరిశ్రమ విషయములో సహకరించవలసిన ఆవశ్యకత గురించి ప్రత్యేకించి చెప్పింది.

ఏ విధంగా, మత్స్యకారులు, మత్స్య పరిశ్రమ మరియు ప్రభుత్వాలు తగిన ఆచరణ యోగ్య విధానాలు తీసుకోవలెనో నియమావళిలో స్పష్టంగా వివరించబడలేదు. అందువలన, ప్రపంచ ఆహార సంస్థ, ఈ ప్రవర్తనా నియమావళిని, ఆచరించడానికి కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తోంది. ఏ ఉద్దేశ్యం కోసం ఈ నియమావళి రూపొందించబడినదో, ఆ ఉద్దేశ్యాన్ని అమలు చేయడానికి తగిన ఆచరణ యోగ్యమైన సాంకేతిక సలహాలను మత్స్యకారులకు, పరిశ్రమకు మరియు మత్స్య నిర్వాహకులకు ఇవ్వడమే ఈ మార్గదర్శక సూత్రాల ప్రధాన లక్ష్యము.



## మత్స్య పరిశ్రమ నిర్వహణ

తమ తమ మత్స్య సంపదను సరైన విధంగా నిర్వహణ చేసుకొనేందుకు దేశాలు, సుస్పష్టమైన చక్కటి ఆచరణ యోగ్యమైన మత్స్య విధానాలను కలిగి ఉండాలని ఈ నియమావళి ప్రతిపాదిస్తున్నది. మత్స్య పరిశ్రమలోని వ్యక్తులు, మత్స్యకారులు, పర్యావరణ బృందాలు, ఆసక్తి గల ఇతర సంఘాల సహకారంతో ఇట్టి విధానాలు తయారు చేసుకోవాలి.

కొన్ని సందర్భాలలో మత్స్య వనరులను ఉమ్మడిగా పంచుకొనే దేశాలకు మత్స్య పరిరక్షణ, నిర్వహణ వంటి విషయాలలో సహకారం కోసం క్రొత్త ప్రాంతీయ మత్స్య సంస్థలను ఏర్పాటు చేయాడానికి లేదా ప్రస్తుతం ఉన్న సంఘాలను పటిష్టం చేసుకోవడానికి ఈ నియమావళి పిలుపునిస్తోంది. ఈ విధమైన పరస్పర సహకారము ఒక్కటే, దీర్ఘకాలిక లక్ష్యసాధనకు నిజమైన మార్గము. ప్రాంతీయ మత్స్య సంస్థల పాత్ర గురించి ప్రాంతీయ మరియు అంతర్జాతీయ సహకారం అనే అంశంక్రింద చర్చించబడినది.

మత్స్య పరిశ్రమ యాజమాన్యం, న్యాయ భద్రత వంటి విషయాల గురించి, మత్స్య పరిశ్రమలోని వ్యక్తులందరికీ సరైన అవగాహన ఉండి, పాటించవలసిన నియమాలను ఖచ్చితంగా తెలిసి ఉండడం చాల ముఖ్యం.

పట్టుకున్న చేపల నాణ్యత చెడిపోకుండా భద్రపరచుకోవడం, అని పాడై పోవడాన్ని తగ్గించడం, పర్యావరణం మీద ఎట్టి ప్రభావం లేకుండా చూడడం వంటి విషయాలను దృష్టిలో ఉంచుకొని, చేపల వేట మరియు చేపలను నిలువ ఉంచే పద్ధతులలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. మత్స్యకారులు, తమతమ వేట వివరములను సక్రమముగా రికార్డులలో నమోదు చేసుకోవాలి. అదే విధంగా, ప్రభుత్వాలు అమలు పరచగల చట్టాలను కలిగి ఉండి నియమాలను ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించాలి. చట్టాన్ని అతిక్రమించిన వారికి జరిమానా విధించడం, ఇంకా తీవ్ర తప్పిదాలు చేసిన పక్షంలో, లైసెన్సులు రద్దుపరచడం వంటి నిర్ణయాలు తీసుకోవాలి. జాతీయ మత్స్య విధానాలు రూపొందించేటప్పుడు అనేక సమస్యలను గుర్తించుకోవాలి. దీనిలో ముఖ్యమైనది చేపల వేటలో లాభం, చేపల వలన పర్యావరణం, సాంఘిక ప్రభావాలు మొదలైనవి.

విధాన నిర్ణయాల రూపకల్పనలో దేశాలు అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. (ముఖ్యముగా సాంప్రదాయరీతిలో చేపలవేట చేయువారి గురించి) సరిఅయిన శాస్త్రీయ సమాచారంలేనప్పుడు చేపలవేట పరిమితులను నిర్ణయించేటప్పుడు, దేశాలన్నీ జాగురూకతతో వ్యవహారించాలి.


ఇట్టి వివిధ మత్స్య సంబంధ విషయాలలో స్థానిక మత్స్యకారులు సంస్థల అభిప్రాయాలు, ఆలోచనలు ప్రోత్సహించాలి. చేపల వేటపై పూర్తిగా ఆధారపడి జీవించే మత్స్యకారుల అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి నిలపాలి. మత్స్యకారులకు, రైతులకు అవగాహన కల్పించి శిక్షణనిచ్చి, తద్వారా, మత్స్య విధానాల రూపకల్పన చేసినట్లైతే, వర్తమాన – భవిష్యత్కాలాలలో సుస్థిర మత్స్య సంపదకు ప్రభుత్వాలు తోడ్పడినట్లుగా భావించవచ్చును.

అన్ని దేశాలు, తమ మత్స్య సంపదను కాపాడడంకోసం, చేపలకు విషమిచ్చి చంపడం, డైనమైట్లు వినియోగించడం, ఇతర వినాశకరవేట పద్ధతులను నిషేధించాలి. తమతమ దేశాలలో చేపలవేట చేయు పడవలను బాధ్యతాయుతంగాను, తమ నియమ నిబంధనలకు, తమ చట్టాలకు లోబడి వేటచేయునట్లు చూడవలెను.

కొన్ని సమయాలలో మితిమీరి అతిగా చేపలవేట జరుగుతోంది. అనగా, భవిష్యత్తులో మత్స్య సంపద అంతరించేటట్లుగా, అనేక చేపలను ఒక్కసారిగా పట్టుకోవడము జరుగుతుంది. ఇది చాలా సమస్యలకు దారితీస్తుంది. దీనిని అధిగమించడానికి చేపలుపట్టే పడవల సంఖ్యను పరిమితంచేయాలి. అంతేకాక, ఏదైనా వలలను నూతనంగా ఉపయోగించేముందు పర్యావరణముపై దాని ప్రభావాన్ని గురించి ఆలోచించాలి. చేపలను వేటాడే పద్ధతులు, వల–పరికరాలు సరైన విధంగా ఎంచుకొని, చిన్న చేపలను, అవసరంలేని చేపలను తప్పించే విధంగా ఉండేటట్లు, (వల కన్ను పరిమాణాన్ని) రూపొందించాలి. ఒకవేళ, వేట పరికరాలు, పద్ధతులు, భవిష్యత్తులో ఎంపిక చేసుకొనబడనివి, వృధా అయినవి అని భావించినయెడల వీటిని దశలవారీగా వదలిపెట్టాలి.

చేపలవేట చేయు యంత్రపు నావలకు కావలసిన ముడి పదార్థములను సాధ్యమైనంతవరకు వృధా కాకుండా కొనుగోలుచేయాలి. అంతేకాకుండా, వ్యర్థ పదార్థాల విడుదలవల్ల కాలుష్యం ఏర్పడకుండా చేపలవేట చేయు పడవల యాజమానులు, పనిచేసే బృందం అంతా జాగ్రత్తలు తీసుకోవాలి.

వాతావరణంలోని వాయు నాణ్యత పరీక్షించడానికి, వేటాడే యంత్రపు నావల పొగగొట్టాల నుండి విషవాయువులు రాకుండా, అలాగే, వాతావరణపై పొరలలో ఉండే ఓజోన్‌పొరను భగ్నపరిచే పదార్థాలు రాకుండా మార్గదర్శక సూత్రాలను అనుసరించాలి. చేపలనివాస ప్రాంతాలైన మడ అడవులు, పగడపు దీవులు, లాగూన్లు, మొదలగు ప్రాంతాలను కాలుష్యం నుండి రక్షించాలి. ఎక్కడైతే ప్రకృతి వైపరీత్యాలవల్ల మత్స్య సంపద తరిగిపోయే అవకాశముందో ముందుగానే గుర్తించి, తక్షణం అట్టి వనరులను సరియైన నిర్వహణ ద్వారా పరిరక్షించాలి.



## పతాకదేశాలు


ఏ దేశాలైతే తమ చేపల వేట నౌకలకు జెండాలను సంకేతముగా ఇస్తాయో, వాటిని పతాకదేశాలు (ఫ్లాగ్ కంట్రీస్)గా పరిగణించడం జరిగింది. తమ దేశీయ జలాలనుండి దూరంగా వేటాడే పడవలకు తగిన ధృవ పత్రాలు ఇచ్చి వాటికి సంబంధించిన ధృవ పత్రాలను, రికార్డులను క్షుణ్ణంగా పొందుపరచి వేటాడనివ్వాలి. అట్టి దేశాలు తమ యంత్రపు నావలకు తగిన సంకేతములను తెలిపే జెండాలు ఇచ్చి, వాటికి భద్రతా, భీమా సౌకర్యాలు కల్పించాలి.

జాతీయ, అంతర్జాతీయ, నిబంధనలు దృష్టిలో ఉంచుకొని, అట్టి చేపలవేట నౌకలకువాటి వేట పరికరాలకు తగిన జాతీయ, అంతర్జాతీయ గుర్తులు ఇవ్వాలి. విదేశీ మత్స్యకారులు, ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు, అట్టి ప్రమాద సమాచార వివరాలను వారికి సంబంధించిన దేశాల ప్రభుత్వాలకు తెలియ జేయాలి.

## రేవు దేశాలు

ఇతరదేశాల నావలను తమ రేవులోనికి అనుమతిచ్చే దేశాలను రేవు దేశాలు (పోర్టు కంట్రీస్)గా పరిగణించడము జరిగింది. విదేశీ యంత్రపు నావలు, తమ రేవులోనికి వచ్చినప్పుడు (అత్యవసరపరిస్థితులలో తప్ప) అట్టి నావలను పరిశీలించడానికి

తగిన విధానాలను దేశాలన్ని ఏర్పరచుకోవాలి. రేవుదేశాలు, నౌకల పతాక దేశం గురించి తెలుసుకొని, ఆయా దేశాలు, తమ నావల చొరబాట్లు పరిశోధనలో సహకరించాలి. ఫిషింగ్ హార్బరులు, నావలు ఆపి సరుకుదించే స్థలాలు సురక్షితంగా ఉండేటట్లు చర్యలు చేపట్టాలి. ఈ ప్రదేశాలు నావల సర్వీసింగు, అమ్మకందార్లు, కొనుగోలుదార్లువంటి అన్ని వసతులతో కూడి ఉండి మౌళికసదుపాయాలు, మంచినీరు సరఫరా, పరిశుభ్రత ఏర్పాట్లు వంటి అవసరమైన అన్ని అంశాలను సమకూర్చడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.



## జల సంవర్ధన (ఆక్వాకల్చర్) అభివృద్ధి


మానవాళి వినియోగానికి చేపలు, రొయ్యల ఉత్పత్తిని పెంచడం, జన్యు సంబంధ వైవిధ్యాలను పరిరక్షించడం మరియు సహసమత్స్య సంపదమీద, పెంపకపు చేపల దుష్ప్రభావమును తగ్గించడము, మానవ వినియోగానికై చేపల సరఫరాను పెంచడము మొదలగునవి జల సంవర్ధన అభివృద్ధికి ప్రాథమిక లక్ష్యాలు.

నీరు, నేల, సముద్ర పాయలువంటి వనరులను వివిధ ప్రయోజనాలకోసం అనేకమంది వినియోగదారులు ఉపయోగిస్తున్నారు. వనరుల వినియోగంలో వివిధ వ్యక్తుల మధ్యగాని, వివిధ దేశాలమధ్యగాని ద్వేషాలు, కలహాలు తప్పించడంకోసం ఆయాదేశాలు తగిన విధానాలు, ప్రణాళికలు కలిగిఉండి, తమకు కేటాయించబడిన వనరులను సక్రమంగా వినియోగించుకోవాలి.

జలసంవర్ధనము (ఆక్వా కల్చర్) అభివృద్ధి చెందడంవలన, ఆయా ప్రాంతాలలో నివసించే స్థానిక మత్స్యకారుల జీవన భృతి, మత్స్య సంపద లభించే ప్రదేశానికి చేరుకునేందుకు మార్గము మరియు చేపల ఉత్పత్తివంటి అంశాలకు ఏ విధమైన వ్యతిరేక ప్రభావము లేకుండా దేశాలన్ని తగిన నిర్ణయాలు తీసుకోవాలి. చేపలు, రొయ్యల పెంపకంవల్ల పర్యావరణం పై ఏ విధమైన ప్రభావం ఉంటుందో తెలుసుకునేందుకు

మరియు సరిదిద్దేందుకు తగిన విధానాలు ఏర్పరచుకోవాలి. అంతేకాక, జల సంవర్ధనములో వాడే వివిధ మేతలు, ఎరువుల గురించి శ్రద్ధవహించాలి. వ్యాధి నిరోధక మందులు, రసాయనాలు, వాతావరణంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి వీటి వాడకం తప్పని సరి పరిస్థితులలో మాత్రమే మితంగా వాడాలి. జలసంవర్ధనము ద్వారా పెంచే చేపల, రొయ్యల మేలిరకము నాణ్యత ముఖ్యమని గమనించాలి.

ఎక్కడైతేకొన్ని రకాల చేపల పెంపకమువల్ల ఏర్పడే ప్రభావం దేశీయ జలాల పరిధిదాటి ఉంటుందో అటువంటి పరిస్థితులలో, ఆదేశాలు తమ ఇరుగు పొరుగుదేశాలతో సంప్రదించి, అట్టి విదేశీ జాతుల పెంపకాన్ని కొనసాగించాలి. కొత్త జాతుల నుండి వ్యాధులు సంక్రమించకుండా ఉండేలా చేయడానికై, నీటి మొక్కలు, ఇతర జీవులు ఒక చోటి నుండి మరొకచోటికి బదిలీ చేసుకుందుకు పరస్పర ఒప్పందాలతో కూడినటువంటి మార్గదర్శక సూత్రాలను కుదుర్చుకోవాలి. జలసంవర్ధన ప్రాజెక్టుల ప్రణాళికల్లో, అంతరించిపోతున్న జాతులను పెంపొందించేందుకు దేశాలన్నీ ప్రణాళిక బద్ధంగా తగిన సాంకేతిక విధానాలు అభివృద్ధి చేసుకోవాలి.




## తీరప్రాంత పరిరక్షణకు మత్స్య పరిశ్రమను సంఘటిత పరచడం

తీరప్రాంతవనరులు (నేల, నీరు) ఏ విధంగా వినియోగించుకోవాలో నిర్ణయించేందుకు, ముందుగా, అక్కడ ఉండే మత్స్యకారులు, ప్రజా జీవన విధానాలు, వారి అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకొని, ప్రణాళికలు తయారుచేసుకోవాలి.

బహుళ ప్రయోజనాలున్న తీరప్రాంతాలలో మత్స్యకారులకు, ఇతరవృత్తులలో ఉన్నవారికి ఏ విధమైన ద్వేషాలు, కలహాలు రాకుండా జాగ్రత్త వహించాలి. ఒకవేళ ఏమైనా కలహాలు సంభవిస్తే, వాటిని సక్రమంగా అమలులో ఉన్న నిష్పాక్షిక విధానాల ద్వారా పరిష్కరించాలి. దగ్గర దగ్గరగా తీరప్రాంతాలున్న ఇరుగుపొరుగుదేశాలు, ఒకదానితో ఒకటి పరస్పర సహకారం చూపుతూ, తీర ప్రాంతవనరుల పరిరక్షణ, యాజమాన్య బాధ్యత వహించాలి.

## ఫలసాయ పరిరక్షణ (పోస్ట్-హార్వెస్ట్) పద్ధతులు మరియు వర్తక భాధ్యతలు



చేపలు, చేప ఉత్పత్తులు ఆరోగ్యకరంగా ఉండేలా చూస్తూ, దేశాలు, తమ ప్రజానీకాన్ని చేపలను ఆహారంగా తీసుకొనేందుకు ప్రోత్సాహించాలి. చేపల నాణ్యతకొరకు ప్రమాణాలు ఏర్పరచి వినియోదారుల ఆరోగ్య పరిరక్షణ, వాణిజ్య పరంగా మోసానికి, గురికాకుండా ఉదాహరణకు వినియోగదారులు కొనుగోలు చేసే చేప గురించి తప్పుడు, సమాచారము పొందకుండా సరైన నియంత్రణ ప్రభుత్వం కల్పించాలి. అంతేగాక, దేశాలన్ని ఒకదానితోనొకటి సహకరించుకొని, తమ సరుకు పరిశుభ్రమైనదిగాను, ఆరోగ్యమైనదిగాను ఉండేలా, ధృవీకరించుకోవాలి.

చేపల ప్రాసెసింగు, రవాణా, నిల్వఉంచే పద్ధతులు పర్యావరణపై ఏ విధమైన దుష్ప్రభావం లేకుండా ఉండేటట్లుచూడాలి. చేపలను పట్టిన తరువాత, అవి పాడైపోయి, పోషక పిలువలు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలి. చేపల ఉపోత్పత్తులు మత్స్యకారులకు అవసరంలేని చేపలు వీలైనంత ఎక్కువ వినియోగానికి తేవాలి. అంతేకాక చేపలను నిలువ ఉంచే పద్ధతులలో నీరు, కలప, శక్తివంటి విషయములలో జాగ్రత్తతో కూడిన నిర్వహణను పాటించాలి. అత్యంత విలువైన ఉత్పత్తులు తయారు చేసినప్పుడు, మత్స్యకారులకు అధికలాభాలు చేకూరే ప్రయోజనం ఉన్నందున, అట్టివాటిని ప్రోత్సాహించాలి.

చేపల, చేప ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపార నిబంధనలు సరళంగా, స్పష్టంగా, అంతర్జాతీయ నియమాలకు అనుగుణంగా ఉండాలి. ఆయా దేశాలలోకాలానుగుణంగా వ్యాపార నియమనిబంధనలు మార్చడానికి పునః పరిశీలించడానికి, అన్ని దేశాల మత్స్యకారులు, వినియోగదారులు, పర్యావరణ సంస్థలను సంప్రదించాలి. ఒకదేశం యొక్క నియమ నిబంధలను మార్చినప్పుడు లేదా రూపొందించినప్పుడు వాటిని ఇతర దేశాలకు తెలిపి వారియొక్క ఎగుమతి – దిగుమతి విధానంలో అవసరమైన మార్పులు తెచ్చేందుకు తగిన సమయం ఇవ్వాలి.

అంతర్జాతీయ వ్యాపార రంగానికి తరిగిపోతున్న మత్స్య సంపద రకాల గురించి సంబంధము ఉండదు. కాబట్టి, దేశాలన్నీ అంతరించి పోతున్న మత్స్యజాతుల వ్యాపారాన్ని క్రమబద్ధీకరించుటకు తగు అంతర్జాతీయ ఒప్పందాల పాటింపులో సహకరించుకోవాలి. అంతేకాక, చేపలు, చేపల ఉత్పత్తుల వ్యాపారం మన మత్స్య సంపదను పరిరక్షించడానికి, సుస్థిరవంతంగా చేయడానికి తీసుకొనే చర్యలకు గండిపడకూడదు.

## మత్స్య పరిశోధన

బాధ్యతాయుతమైన మత్స్య పరిశ్రమ విధానానికి ఒక దృఢమైన శాస్త్రీయ దృక్పథం అవసరమని దేశాలన్నీ గుర్తించాలి. అందువల్ల యువశాస్త్ర, సాంకేతిక నిపుణులను శిక్షణా విషయంగా ప్రోత్సాహించి, తగిన పరిశోధనా సౌకర్యాలు కల్పించాలి. కనీస అభివృద్ధి చెందుతున్న దేశాలు మరియు చిన్న ద్వీపాల అవసరాలను ప్రత్యేకంగా గమనించి, వారి శాస్త్రీయ పరిశోధనలకు సాంకేతిక మరియు అంతర్జాతీయ సంస్థలు చేయూత నివ్వాలి.

పరిశోధన నిర్వహించుటకొరకు, చేపల నివాస ప్రాంతాలు, వాటి పరిస్థితులు, వాటిలో వచ్చే మార్పులు మొదలగు అంశాలను దేశాలన్నీ పరిశీలనలోకి తీసుకోవాలి. వివిధ రకాల వేట పరికరాలను ఉపయోగించి (లక్ష్యీకరించబడిన చేపజాతులను పట్టుకొనేటప్పుడు) పర్యావరణంపై ఆ వేట పరికరాల ప్రభావం గురించిన వివరాలు సేకరించాలి. ఈ విధమైన పరిశోధన ఆయా దేశం ఏదైన కొత్తవేట పరికరంగాని, వేట విధానంగాని, వివిధ సాంఘిక, క్రయ–విక్రయాల విషయాలనుగాని వాణిజ్యపరంగా ప్రవేశపెట్టాలని సంకల్పించినప్పుడు ఎంతో ముఖ్యమైనది.


అంతర్జాతీయ పరిశోధన ప్రయత్నాలకు దేశాలన్ని సమాయత్తము అవ్వాలి. విదేశీ జలాలలో పరిశోధన చేపట్టినప్పుడు, ఆ దేశం (ఆతిథ్య దేశం) యొక్క మత్స్య నియమ నిబంధనలకు కట్టుబడి పరిశోధకులు తమ పరిశోధన సాగించాలి. అంతేకాక, చేపలవేట విధానం, దానికి సంబంధించిన శాస్త్రీయ సమాచారాన్ని ప్రాంతీయ మత్స్య సంస్థలకు వీలైనంత త్వరలో అందుబాటులో ఉంచాలి. అట్టి సమాచారాన్నే ఆసక్తిగల అన్ని దేశాలకు కూడా పంపిణీచేయాలి.

## ప్రాంతీయ మరియు అంతర్జాతీయ సహకారం

మత్స్య పరిశ్రమకు సంబంధించిన దేశాలు ప్రాంతీయ మత్స్య సంస్థలు, మత్స్య పరిశ్రమ విషయములో పరస్పరము సహకరించుకోవాలన్నది సుస్పష్టం. వివిధ దేశాలు

ఒకేరకమైన మత్స్య సంపదను వేటాడేటప్పుడు, ఒకే విధమైన యాజమాన్యపు పద్ధతులు పాటించాలి. అంతేగాక, ప్రాంతీయ సంస్థల ద్వారా సహకరించుకోవడమువలన ఇతర దేశాలతో మత్స్య పరిశ్రమకు సంబంధించిన కలహాలు ఏర్పడవు. ఒక వేళ, ఏమైనా ఆటంకాలు ఏర్పడినా వాటిని త్వరగాను, శాంతియుతంగాను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి.

ప్రాంతీయ మత్స్య సంస్థలు, వారి సభ్యులనుండి పరిశోధనకొరకు, వనరుల పరిరక్షణకొరకు యాజమాన్యము లేదా నిర్వహణకొరకు వ్యయాన్ని సేకరించుకోవాలి. అంతేగాక, ప్రాంతీయ మత్స్య సంస్థల కార్యకలాపాలలో స్థానిక మత్స్యకార సంస్థల సంఘాలు కూడా కలిసి పనిచేయడానికి అనుమతించాలి.



## ఇదంతా ఏం చెబుతుంది ?

దేశాలన్ని తెలివైన విధానాలలో బాధ్యతాయుతమైన చేపలవేటచేసి, సక్రమంగా యాజమాన్యపు పద్ధతులు పాటించినప్పుడు, మత్స్య సంపద సంవత్సరాల తరబడి సమృద్ధిగా లభిస్తుంది. అదే విధంగా, జలసంవర్ధనం ద్వారా చేపల, రొయ్యల పెంపకము పర్యావరణానికి హాని కలుగకుండా చేపట్టినప్పుడు, ప్రజల సాంఘిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, తద్వారా దేశాల ఆర్థిక స్థితి బాగుపడడానికి సహకరిస్తుంది.

బాధ్యతాయుత మత్స్య పరిశ్రమకొరకు ప్రవర్తనా నియమావళిని మత్స్య రంగంలోని ప్రతి ఒక్కరూ విజయవంతంగా ఆచరణలో పెట్టినప్పుడు, వర్తమాన భవిష్యత్కాలాలలో

ప్రజలకు మత్స్య సంపదను అందించినవారవుతారు. అజాగ్రత్తగా, విచక్షణా రహితంగా మితిమీరిన వనరులను వినియోగించకుండా పరిరక్షించాల్సిన నైతిక బాధ్యత నేటి తరానికి ఉంది.

మత్స్య పరిశ్రమ ఆరోగ్యవంతంగా దినదిన ప్రవర్థమానంగా ఉండడానికి, ఈ ప్రవర్తనా నియమావళి దేశాలను, వాటి పౌరులను సక్రమంగా సంఘటిత విధానాలను మత్స్యరంగంలో ఆచరించ వలెనని కోరుతున్నది. ఈ దీర్ఘకాలిక చర్యల మూలంగా, చేపల లభ్యత, ఆహారపరిస్థితి, భద్రత మరియు అధిక ధనార్జన అవకాశములు లభిస్తాయి.

ఈ విధంగా ప్రపంచ దేశాలన్ని బాధ్యతాయుతమైన చేపల వేట, పెంపకమును అమలులోకి తీసుకు వస్తే, తర తరలాకు తరగని మత్స్యసంపద అందరికి అందుబాటులోరాల ఉంటుంది. ప్రపంచ ఆహార సంస్థ యొక్క మత్స్యశాఖ రూపొందించిన ఈ చిన్న పుస్తకము అందించే సమగ్ర సమాచారము మీ వంతు కృషిగా ప్రపంచ మత్స్య సంపదను, జల సంవర్ధనమును అభివృద్ధి చేసి, బాధ్యతాయుతముగా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆశిస్తోంది.


ఈ చిన్న పుస్తకము బాధ్యతాయుతమైన మత్స్య పరిశ్రమ కోసం ప్రవర్తనా నియమావళిని సాంకేతికంగా వివరిస్తోంది.

ఈ ప్రవర్తనా నియమావళి ఉద్దేశ్య లక్ష్యాలను గురించి ఒక విధమైన అవగాహన కలుగజేయు బడుటయే ఈ పుస్తకము ముఖ్యోద్దేశము. దీని ద్వారా సహజ సిద్ధంగా లభించే మత్స్య సంపద, జలసంవర్ధనాభివృద్ధిని ఏవిధంగా సాధించగలమో కూడా తెలియజేయబడినది.

ప్రవర్తనా నియమావళిలోని క్లిష్టమైన సమాచారములోని కొన్నింటికి సరళంగా, స్పష్టంగా తెలియ జేయడము ద్వారా మత్స్య పరిశ్రమలోని వ్యక్తులందరికి దీనిని అందుబాటులో ఉంచడము కోసము ఈ చిన్న పుస్తకము బాధ్యతాయుతమైన మత్స్య పరిశ్రమకు ప్రవర్తనా నియమావళిని త్రోసివేయదు.

ఈ పుస్తకములో బాధ్యతాయుత మత్స్యకార్యకలాపాలను నిర్వహించుటకు కావలసిన
ప్రవర్తనా నియమావళి మేరకు కొన్ని ముఖ్య విషయాలను
సాంకేతికపరంగా కాక సులభ శైలిలో పొందుపర్చటమైనది. చేపల వేట మరియు
పెంపకములను సమర్థవంతమైన పద్ధతిలో ప్రోత్సహించుటకు నియమావళి
యొక్క ఆవశ్యకతను తెలియ చేస్తున్నది.

ఈ చిన్న పుస్తకము పూర్తి స్థాయిలో ప్రవర్తనా నియమావళిని తెలియజేయనప్పటికీ,
ఎన్నో సంక్లిష్ట విషయాలను సరళీకృత విధానములో తెలియ జేస్తూ,
మత్స్యవినియోగదారులందరికీ అర్థమై, అనుసరించగలిగే
విధంగా రూపొందించబడినది.



Translation and Printing of this booklet has been arranged by the
Bay of Bengal Programme, 91, Saint Mary's Road, Abhiramapuram,
Chennai-600 018, India (Tel: # 91 44 4936188; Fax: # 91 44 4936102)